# రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ

రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ ప్రభుత్వశాఖలలో పురాతనమైనది. 1864 వ సంవత్సరము నుండి ఈ శాఖ ప్రజలకు వివిధసేవలను అందించుచున్నది. స్థిర చరాస్తులపై జరిగే లావాదేవీలకు సంబంధించిన దస్తావేజులను రిజిస్టరు (నమోదు) చేయుట, రిజిస్టరైన దస్తావేజుల నకళ్ళను శాశ్వత ప్రాతిపదికపై భద్రపరచుట, స్థిరాస్తుల లావాదేవీలకు సంబంధించి రిజిస్టరైన దస్తావేజుల రికార్డును ఒక క్రమ పద్ధతిలో నిర్వహించుట, ప్రజలకుగాని, కోర్టులకు గాని, బ్యాంకులు మొదలగు ఇతర సంస్థలకు గాని అవసరమైనపుడు అట్టి దస్తావేజుల నకళ్ళను, రిజిస్టరైన దస్తావేజుల రికార్డును జారీ చేయుట, మొదలైనవి ఈ శాఖ నిర్వర్తించు విధులలో ముఖ్యమైనవి.

దస్తావేజులను నమోదు చేసే సమయములో రిజిస్టరింగు అధికారులు పాటించే నియమ నిబంధనల వలననూ, రిజిస్టరైన దస్తావేజులకు ఒక క్రమ పద్ధతిలో సూచికలను మరియు దస్తావేజులకు సంబంధించిన వ్యక్తుల వివరములను భద్రపరచుటలో తీసికొను జాగ్రత్తల వలననూ ఈ శాఖ జారీ చేసే నకళ్ళు (సి.సి.లు – సర్టిఫైడ్ కాపీలు) మరియు ఎన్‌కంబ్రెన్సు సర్టిఫికేట్లు (ఇ.సి.లు – ఋణ భార ధృవీకరణ పత్రములు) ప్రామాణికతను సంతరించుకొన్నవి. కనుకనే స్థిరాస్తుల కొనుగోలు సందర్భములలో సదరు ఆస్తులకు సంబంధించి రిజిస్టరైన లావాదేవీల వివరములను తెలిసికొనుటకు ప్రజలు, ఋణములను మంజూరు చేసే సందర్భములలో బ్యాంకులు మరియు ఇతర ఆర్థిక సంస్థలు, స్థిరాస్తులకు సంబంధించిన వ్యాజ్యములను పరిష్కరించే సందర్భములలో న్యాయస్థానములు ఈ శాఖ జారీ చేసే నకళ్ళను మరియు సర్టిఫికేట్లను ప్రమాణముగా స్వీకరించుట జరుగుచున్నది.

వివిధ రకాల దస్తావేజులను రిజిస్టరు చేసేటప్పుడు స్టాంపు సుంకము మరియు రిజిస్ట్రేషన్ రుసుములను వసూలు చేయుట ద్వారా రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ రాష్ట్రప్రభుత్వ ఖజానాకు గణనీయమైన ఆదాయమును సమకూర్చుచున్నది. ప్రస్తుతము మన తెలంగాణ రాష్ట్రములో ప్రభుత్వ ఖజానాకు అత్యధిక ఆదాయమును సమకూర్చు శాఖల జాబితాలో ఈ శాఖ మూడవ స్థానములో ఉన్నది.

ఈ శాఖ అమలు చేయుచున్న చట్టములు, ఆయా చట్టముల క్రింద ఈ శాఖ నిర్వర్తించే ముఖ్యమైన విధుల వివరములు :

| | |
|---|---|
| 1. రిజిస్ట్రేషన్ చట్టము, 1908 | 1. రిజిస్ట్రేషన్ శాఖ యొక్క నిర్మాణము, వివిధ అధికారులు నిర్వర్తించ వలసిన విధులు, 2. తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకొనవలసిన దస్తావేజులు, మరియు వేటి రిజిస్ట్రేషన్ ఐచ్ఛికము 3. దస్తావేజులను రిజిస్ట్రేషన్ నిమిత్తము దాఖలు చేసే విధానము మరియు కాల పరిమితులు 4. దస్తావేజులను రిజిస్టరు చేసి భద్రపరిచే పద్ధతులు 5. రికార్డుల శోధన, మరియు నకళ్ళను, ఈసీలను (ఎన్‌కంబ్రెన్సు సర్టిఫికేట్లను) జారీ చేసే పద్ధతి 6. రిజిస్ట్రేషన్ తిరస్కరించబడినప్పుడు అనుసరించవలసిన విధానము, 7. వివిధ దస్తావేజుల రిజిస్ట్రేషన్ నిమిత్తము మరియు నకళ్ళు, ఈసీల జారీ కొరకు విధించే రుసుములు మొదలగు అంశములను ఈ చట్టము నిర్దేశించుచున్నది.<br>దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేయుటకు మరియు నకళ్ళు, ఈసీలను జారీ చేయుటకు సబ్–రిజిస్ట్రార్లకు అధికారములు ఇవ్వబడినవి. సబ్–రిజిస్ట్రార్లు దస్తావేజులను రిజిస్టరు చేయుటకు తిరస్కరించినప్పుడు జిల్లా రిజిస్ట్రారుకు అప్పీలు చేసికొనవచ్చును. |
| 2. భారత స్టాంపు చట్టము, 1899. | ఇది వివిధ దస్తావేజులపై స్టాంపు సుంకమును విధించి వసూలు చేయుటకు ఉద్దేశించిన చట్టము. ప్రస్తుతము రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఆదాయ వనరులలో స్టాంపు సుంకము ఒకటి. 1. వివిధ దస్తావేజులలో వ్రాయబడిన విషయములను బట్టి వాటిని వర్గీకరించుట 2. ఏయే దస్తావేజులపై స్టాంపు సుంకాన్ని ఎవరు చెల్లించాలి? 3. స్టాంపు సుంకాన్ని సక్రమంగా చెల్లించనప్పుడు ఏ విధమైన చర్యలు తీసుకొన బడతాయి. 4. దస్తావేజులలో పొందుపరచబడిన వివరాలను బట్టి ఆస్తుల విలువలను, వాటిపై చెల్లించవలసిన సుంకాన్ని కలెక్టర్లు ఏ విధంగా నిర్ణయిస్తారు 5. కలెక్టర్ల నిర్ణయాలపై అప్పీళ్ళు 6. స్టాంపుల ముద్రణ, సరఫరా మరియు అమ్మకము 7. చెల్లించవలసిన సుంకాన్ని ఉద్దేశ |

పూర్వకంగా ఎగవేసినప్పుడు తీసుకొనబడు క్రిమినల్ చర్యలు 8.ప్రభుత్వ కార్యాలయాలలోను మరియు సంస్థలలోను దాఖలయ్యే దస్తావేజుల తనిఖీ మొదలగు అంశములను ఈ చట్టము మరియు నియమావళి నిర్దేశిస్తాయి.

ఈ చట్టము క్రింద కలెక్టరు అధికారాలు జిల్లా రిజిస్ట్రార్లకు, వారి నిర్ణయాలపై అపిలేట్ అధికారాలు కమిషనర్ మరియు ఇన్స్‌పెక్టరు జనరల్ వారికి ఇవ్వబడినవి.

3. సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టము, 2001.

ఈ చట్టము క్రింద విద్యా, విజ్ఞాన, వినోద, సాహిత్య, సాంస్కృతిక, ధార్మిక పరమైన ప్రజాసంఘాలు, కళల, హస్తకళల, క్రీడల అభివృద్ధికి పాటుపడే సంఘాలు; ప్రజాశ్రేయస్సుకు, ప్రజాప్రయోజనాలకు కృషిచేసే సంఘాలు రిజిస్టరు చేయబడతాయి. వాటి రిజిస్ట్రేషన్ కొరకు ఏయే పత్రాలు దాఖలు చేయాలి ఆ పత్రాలలో ఏయే విషయాలను పొందుపరచాలి; వాటిలో సభ్యత్వము, అట్టి సంఘాల సర్వసభ్యమండళ్ళు, పాలక మండళ్ళు; అవి నిర్వహించే సమావేశాలు, ఎన్నికలు; వాటి తీర్మానాలు; అవి ప్రతి సంవత్సరము రిజిస్ట్రారుకు దాఖలు చేయవలసిన పత్రాలు; అంతర్గత వివాదముల పరిష్కారము; ఒక సంఘమును విభజించుకొన్నప్పుడు లేక రద్దు చేసికొన్నప్పుడు లేదా కొన్ని సంఘాలు ఒకటిగా విలీనమైనప్పుడు అనుసరించవలసిన విధానము మొదలగు అంశాలను ఈ చట్టము నిర్దేశిస్తుంది.

ఇట్టి సంఘాలను రిజిస్టరు చేయడానికి; అవి దాఖలు చేసే వార్షిక నివేదికలను, ఇతర పత్రములను రికార్డు చేయడానికి; అట్టి పత్రముల నకళ్ళను జారీ చేయడానికి జిల్లా రిజిస్ట్రార్లకు అధికారాలు ఇవ్వబడినవి.

అయితే సంఘాల కార్యకలాపాలను పర్యవేక్షించడానికి లేక నియంత్రించడానికి, వివాదాలను పరిష్కరించడానికి మాత్రం జిల్లా రిజిస్ట్రార్లకు ఎట్టి అధికారాలు లేవు. వివాదాలను కోర్టులలోనే పరిష్కరించుకొనవలెను.

4. భారత భాగస్వామ్య చట్టము, 1932.

ఈ చట్టము భాగస్వామ్య సంస్థలలోని భాగస్వాముల హక్కు, బాధ్యతలను; భాగస్వామ్య సంస్థలను మరియు భాగస్వామ్యము నందలి మార్పుచేర్పులను రిజిస్టరు చేసే విధానాన్ని; వాటి నకళ్ళను జారీ చేసే పద్ధతిని; భాగస్వాములు తమ తమ లెక్కలను పరిష్కరించుకొనే పద్ధతి మొదలగు విషయాలను నిర్దేశిస్తుంది.

సంస్థల మరియు వాటి మార్పుచేర్పులను, రిజిస్టరు చేయడానికి, నకళ్ళను జారీ చేయడానికి జిల్లా రిజిస్ట్రార్లకు అధికారములు ఇవ్వబడినవి. ఇట్టి సంస్థల కార్యకలాపాల క్రమబద్ధీకరణ లేక నియంత్రణ మాత్రం ఈ శాఖ లేదా ప్రభుత్వ పరిధిలోనిది కాదు.

5. హిందూ వివాహ చట్టము, 1955.

హిందూ ఆచార వ్యవహారముల ప్రకారము జరిగిన వివాహములను ఈ చట్టము క్రింద రిజిస్టరు చేసి వివాహ ధృవీకరణ పత్రములను జారీ చేయుదురు. సంబంధిత సబ్‌రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్లు, ఉప ఇన్స్పెక్టర్ జనరళ్ళు ఇట్టి వివాహములను రిజిస్టరు చేయు అధికారమును కలిగి యున్నారు.

ఈ చట్టము, వీరశైవులు, లింగాయతులు, బ్రహ్మసామాజికులు, ఆర్య సామాజికులతో సహా హిందువు లందరికిని, బౌద్ధులకు, జైనులకు మరియు సిక్కులకు వర్తిస్తుంది కాని షెడ్యూల్డు తెగల వారికి మాత్రము వర్తించదు.

| | |
|---|---|
| 6. ప్రత్యేక వివాహ చట్టము, 1954. | ఈ చట్టము క్రింద, వివాహ అధికారులే వధూవరులచే ప్రమాణము చేయించుట ద్వారా వివాహములను జరిపి, రిజిస్టరు చేసి, వివాహ ధృవీకరణ పత్రములను జారీ చేయుదురు. సంబంధిత సబ్–రిజిస్ట్రార్లు వివాహ అధికారులుగా వ్యవహరింతురు. భారత పౌరులందరికీ (వధూవరులలో ఏ ఒక్కరు భారత పౌరులైనా) ఈ చట్టము వర్తించును. |
| 7. భారత క్రైస్తవ వివాహ చట్టము, 1954. | ఈ చట్టము క్రింద, ప్రభుత్వము వారి నుండి లైసెన్సు పొందిన పాస్టర్లు వధూవరులచే ప్రమాణము చేయించుట ద్వారా వివాహములను జరిపి, రిజిస్టరు చేసి, వివాహ ధృవీకరణ పత్రములను జారీ చేయుదురు. భారత క్రైస్తవులందరికీ (వధూ వరులలో ఒక్కరు క్రైస్తవులైనా) ఈ చట్టము వర్తిస్తుంది.<br>అట్టి వివాహముల వివరములను పాస్టర్లు సంబంధిత జిల్లా రిజిస్ట్రారుకు పంపవలెను. జిల్లా రిజిస్ట్రార్లు అట్టి వివరములను భద్రపరచి, అవసరమైనప్పుడు నకళ్ళు జారీ చేయుదురు. |
| 8. చిట్‌ఫండ్స్ చట్టము, 1982 | ఈ చట్టము క్రింద, కమీషనర్ మరియు ఇన్స్పెక్టర్ జనరల్ వారు రిజిస్ట్రారు గాను, ఉప ఇన్స్‌పెక్టర్ జనరళ్ళు, జాయింట్ రిజిస్ట్రార్లుగాను, సహాయ ఇన్స్‌పెక్టర్ జనరళ్ళు మరియు జిల్లా రిజిస్ట్రార్లు డిప్యూటీ రిజిస్ట్రార్లుగాను, చిట్ రిజిస్ట్రార్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్లుగాను నియమింపబడియున్నారు.<br>చిట్‌ఫండ్ ఒప్పందములను, సవరణలను నమోదు చేయుట, మినట్స్‌ను ఫైల్ చేసికొనుట, నకళ్ళను జారీ చేయుట, ఫోర్‌మెన్ మరియు చిట్ సభ్యుల మధ్య వివాదములను పరిష్కరించుట, అవసరమైనప్పుడు మధ్యవర్తులను నియమించుట, చిట్ రికార్డులను తనిఖీ చేయుట మొదలగునవి ఈ చట్టము క్రింద ఈ శాఖ నిర్వర్తించవలసిన ముఖ్యమైన విధులు. |
| 9. వాణిజ్యేతర సంస్థల చట్టము, 1962 | ఈ చట్టము క్రింద వాణిజ్యేతర సంస్థలు రిజిస్టరు చేయబడును. ఈ విషయములో కమిషనర్ మరియు ఇన్స్‌పెక్టర్ జనరల్ వారు మరియు సహాయ ఇన్స్‌పెక్టర్ జనరల్ వారు రిజిస్ట్రార్లుగా వ్యవహరించెదరు. |
| 10. నోటరీల చట్టము, 1952. | కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వములు,×× పది సంవత్సరములపైగా ప్రాక్టీసు చేయుచున్న న్యాయవాదులను ఈ చట్టము క్రింద నోటరీలుగా నియమించుచు లైసెన్సులను జారీ చేయుటకు, వాటిని పునరుద్ధరించుటకు, రద్దు చేయుటకు అధికారము కలిగి యున్నవి. ఈ వ్యవహారమంతయు కమిషనర్ మరియు ఇన్స్‌పెక్టర్ జనరల్ వారి ద్వారా జరుగును.<br>నోటరీల విధులు, వారు నిర్వహించవలసిన రికార్డులు, సదరు రికార్డుల తనిఖీ మొదలగు విషయములను ఈ చట్టము నిర్దేశిస్తుంది.<br>జిల్లా రిజిస్ట్రార్లు మరియు ఉప ఇన్స్‌పెక్టర్ జనరళ్ళు నోటరీల రికార్డును తనిఖీ చేయు అధికారములను కలిగియున్నారు. |